క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై రేపు అవగాహన కార్యక్రమం

మద్దిపాడు: సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, పౌరసమాచార అధికారులు, సహాయ పౌరసమాచార అధికారులు, అప్పిలేట్ ఆధికారులకు సమాచార హక్కు చట్టం–2005పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 10.30 గంటలకు మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాని అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు కానిస్టేబుల్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి కె.బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎల్బీజీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రకటించిన 6100 కానిస్టేబుల్ పోస్టులే కాకుండా అదనంగా మరో 16,862 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులో 10,762 పోస్టులు భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు అసెంబ్లీ సమావేశంలో చెప్పారని గుర్తు చేశారు. హోం మంత్రి ప్రకటించి నేటికి 8 నెలలు గడుస్తున్నప్పటికీ అతీగతీ లేదన్నారు. నోటిఫికేషన్ విడుదల చేయకుండా మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఖాళీగా ఉన్న పోస్టులతో పాటుగా ప్రస్తుతం రిటైర్డ్ అయిన పోస్టులను కూడా భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో పీ కిరణ్, వై.దానియేలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ సంతోష్ తెలిపారు. సంతనూతలపాడు ఇండ్రస్టియల్ ఏరియా, గుడిపాడు, కొనగానివారిపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓట్ల కోసం అడ్డగోలు హామీలు

- అధికారంలోకి వచ్చాక ప్రజలకు వెన్నుపోటు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: ఓట్ల కోసం ఎన్నికలకు ముందు అడ్డగోలుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిట్టనిలువునా చంద్రబాబు మోసం చేశారని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి ఒంగోలు నగరంలోని 20వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేశారు, టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిలో ప్రజలు ఎంత నష్టపోయారో వివరించారు. ఏడాది పాలనలో కనీసం ఒక్కరికి కూడా కొత్త పింఛన్ ఇచ్చారేమో చెప్పాలని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ హామీల పేరిట సీఎం చంద్రబాబు ప్రజలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. హామీలపై ఎవరైనా ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సాగిస్తున్న మోసపూరిత పాలనను వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు దామరాజు క్రాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు రాజీవ్, మహిళా నాయకులు అప్సర బేగం, వాణి, మేరీ, శోభలత, దేవ, శ్రీకాంత్, పీటర్, యోహాన్, అమర్, 20వ డివిజన్ నూతన అధ్యక్షుడు కొడవటి ప్రవీణ్ కుమార్, పరుశు ఏసోబు, పసుమర్తి జాను బాబు, జొన్నలగడ్డ మోషు, గవ్వల అఖిల్, చాట్ల కిషోర్, గుంటూరు సువర్ణపాల్, తేళ్ల వరుణ్, భాస్కర్, అశోక్ బాబు, పసుపర్తి అశోక్, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

టీడీపీ కార్యకర్తలకు ఉపాధి కల్పించడం దుర్మార్గం



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఒంగోలు టౌన్: గత 20 ఏళ్ల నుంచి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన వారి స్థానంలో, రిటైరైన వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలకు ఉపాధి చూపడం దుర్మార్గమని సీఐటీయూ నగర కార్యదర్శి టీ మహేష్ విమర్శించారు. చనిపోయిన, రిటైర్డ్ అయిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నగరంలోని అన్ని మస్టర్ పాయింట్ల వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 115 మంది మేస్త్రీలను విధుల నుంచి తొలిగించిందని, కూటమి కార్యకర్తలు 50 మందిని మేస్త్రీలుగా, సూపర్‌వైజర్లుగా నియమించి వారిచే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. నగర కార్పొరేషన్లో మేస్త్రీ వ్యవస్థను రద్దు చేసి కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పుకున్న కూటమి నాయకులు అదే వ్యవస్థను కొనసాగించడం ద్వారా ప్రజల్ని, కార్మికుల్ని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కూటమి కార్యకర్తలకు మాత్రమే ఉపాధి కల్పించడం సరైన పద్ధతి కాదన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసరావు మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలను నిలిపివేసి డ్రైవర్లను తొలిగించడంతో పారిశుధ్య కార్మికులపై పని భారం పెరిగిందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్మికులను వ్యక్తిగత పనులకు ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. కార్మికుల సంఖ్య పెంచకుండా వారిపై పనిభారం పెంచడం, బెదిరింపులకు గురిచేయడం, రాజకీయ జోక్యం చేసుకోవడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విజయమ్మ, రత్నకుమారి, సామ్రాజ్యం, నరసింహ, రాములు, లక్ష్మీకాంతం, బాబు, శ్రీనివాసరావు, సుబ్బారావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డును సత్కరించిన ఎస్పీ



హోంగార్డు చెన్నయ్యను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: కనిగిరి పోలీసు స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ జూలై 31వ తేదీ రిటైరైన గాలంకి చెన్నయ్యను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ సత్కరించారు. చెన్నయ్య కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్లపాటు సుదీర్ఘకాలం హోంగార్డుగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై శ్రీనివాసరావు, కనిగిరి ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ఐఆర్ ప్రకటించాలి



బీటీఏ సభ్యత్వం నమోదు చేస్తున్న శరత్ చంద్రబాబు, జగన్నాథం ప్రసాద్

కొత్తపట్నం: ఐఆర్‌ను వెంటనే ప్రకటించి ఉపాధ్యాయులను ఆదుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు డిమాండ్ చేశారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ కొత్తపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పీఆర్సీ కమిషన్ వేసి వెంటనే ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జగన్నాథం ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడి తగ్గించి బోధనకు అనుకూలమైన పరిస్థితులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీటీఏ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొండపి కార్మికులకు 10న వేతనంతో కూడిన సెలవు

ఒంగోలు వన్‌టౌన్: కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలను ఈ నెల 10వ తేదీ నిర్వహిస్తున్నందున ఎన్నికలు జరిగే ప్రాంతంలోని కార్మికులకు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని వ్యాపారస్తులను ఆదేశిస్తూ ఒంగోలు సహాయ కార్మిక కమిషనర్ కె.పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 నియమ నిబంధనల ప్రకారం వ్యాపారస్తులు నడుచుకోవాలని కోరారు.

బీటెక్ విద్యార్థులకు ఘన స్వాగతం



మాట్లాడుతున్న విద్యాసంస్థల అధినేత డాక్టరు సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరంలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు స్వాగత (ఇనాగురల్) కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత డాక్టరు నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టరు నిడమానూరి శ్రీ గాయత్రి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపి సరస్వతీదేవికి పూజ చేశారు. ఈ సందర్భంగా సూర్యకల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ కాలేజీ పెట్టిన మొదటి ఏడాది 180 మంది విద్యార్థులు చేరారని, ఆ సంఖ్య ఇప్పుడు దాదాపు 2 వేలకు చేరిందని తెలిపారు. 27 ఏళ్లలో విద్యాసంస్థల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో క్వాలిటీ విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీగాయత్రి మాట్లాడుతూ తమ కళాశాలలో మొదటి ఏడాది నుంచే సాఫ్ట్ స్కిల్స్, ప్రాజెక్టులు లాంటి ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా గతేడాది 928 మందికిపైగా విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బి.వి.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, హెచ్‌వోడీ డాక్టర్ గంటా శ్రీనివాసరావు, కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్య మెహర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్స్ డీన్ జగదీష్, శ్రీ నిడమానూరి ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ చెంచు ప్రసాద్, డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

- తహసీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ, దళిత, ప్రజాసంఘాల నాయకుల విజ్ఞప్తి
- బాలిక జుట్టు కత్తిరించిన వారిని ఇంకా గుర్తించకపోవడం దారుణమంటూ వినతిపత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో రెండు రోజుల క్రితం 9వ తరగతి చదువుతున్న బాలిక జుట్టును కత్తిరించిన వారు ఎవరో ఇప్పటికీ తెలుసుకోలేకపోయిన వార్డెన్, సంబంధిత సోషల్ వెల్ఫేర్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, సహాయ కార్యదర్శి జీ దేవరాజు డిమాండ్ చేశారు. ఆ మేరకు చీమకుర్తి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో భోజనం, తాగునీరు విద్యార్థినులకు సరిగ్గా అందించటం లేదని, కనీస, మౌలిక వసతులు కల్పించటంలో వార్డెన్ శ్రద్ధ వహించటం లేదని ఆరోపించారు. హాస్టల్‌లో తోటి బాలిక జుట్టు కత్తిరించటంతో మిగిలిన బాలికలు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురై దాదాపు 150 మంది బాలికలు హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. దాని వలన ఆయా బాలికల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాస్టల్ సంఘటనపై విచారణ జరిపించాలి...

ఎస్సీ బాలికల హాస్టల్‌లో బాలిక జుట్టు కత్తిరించిన ఘటనపై జిల్లా ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని ప్రజాసంఘాల నాయకుడు బండ్ల డేవిడ్, తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం తహీసీల్దార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జుట్టు కత్తిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాలికలకు మనోధైర్యాన్ని కల్పించాలనే పలు రకాల డిమాండ్‌లతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్ర, వేదికపై ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు

చీమకుర్తి రూరల్: ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరమని మండల అభివృద్ధి అధికారి కె.రాఘవేంద్ర అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అజిత, ఏఓ శ్రీనివాసరావు, సునీల్, శాంతిప్రియ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలి


- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు



శిక్షణను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ఆమెకు ఇవ్వాల్సిన రెండు విడతల టీకాలను క్రమం తప్పకుండా వేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టీ.వెంకటేశ్వర్లు ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ కార్యక్రమాన్ని సర్వజన ఆస్పత్రిలో సోమవారం ప్రారంభించారు. గర్భిణులకు అందిస్తున్న సేవల వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని చెప్పారు. జీరో నుంచి ఐదేళ్ల పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన టీకాలన్నీ వేయాలన్నారు. టీకాలు వేయకుండా నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కమల శ్రీ మాట్లాడుతూ వైద్యాధికారులు, పర్యవేక్షకులు తరచుగా ఇమ్యూనైజేషన్ సెక్షన్లను తనిఖీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వంతెన రక్షణ గోడను ఢీకొట్టిన లారీ



ప్రమాదానికి గురైన లారీ

చీమకుర్తి రూరల్: ఒంగోలు – కర్నూలు రోడ్డుపై మండలంలోని చీమలమర్రి బస్ షల్టర్ సమీపంలో ఉన్న వంతెన రక్షణ గోడను లారీ ఢీకొట్టిన సంఘటన సోమవారం జరిగింది. రామతీర్థం నుంచి రామాయపట్నం పోర్టుకు రాళ్లతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఢీకొట్టి తిరగబడింది. ఎస్కార్టుల సాయంతో లారీని పైకిలేపారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.







స్కూళ్లు వదిలిన అనంతరం వర్షం నీటిలో ఇబ్బంది పడుతూ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

వీధుల్లో ఏరులై పారుతున్న వర్షం నీరు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తటాకం కాదు.. ఒంగోలు వారి వీధి

యర్రగొండపాలెం: కొద్దిపాటి వర్షం కురిసినా పట్టణంలోని వీధుల్లో నీరు ఏరులై పారుతుంది. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సైడ్ కాలువలు లేక పోవడం, రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో నీరు ఎక్కడికి అక్కడే నిల్వ చేరుతుంది. వర్షం నీరు ఎటూ వెళ్లేందుకు వీలుపడక ఇళ్లల్లోకి వస్తున్నాయని, ఈ నీటితో విష పురుగులు చేరుతున్నాయని ఆయా ప్రాంతాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కురిసిన వర్షంతో ఒంగోలు వారి వీధిలో తటాకంలా నీరు ప్రవహించింది. బ్రహ్మంగారి గుడి వద్ద ఉన్న మండల పరిషత్ పాఠశాలల సముదాయం నుంచి విద్యార్థులు తమ గృహాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ పాఠశాలలకు పడమటి బజార్, ఇజ్రాయిల్‌పేట, రాములవారి వీధి, చాకలివారి వీధి, ఒంగోలు వారి వీధి ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వెళ్తుంటారు. పాఠశాలలు వదిలే సమయంలో వర్షం పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలను క్షేమంగా ఇళ్లకు చేర్చుకునేందుకు అనేక మంది పాఠశాలల వద్దకు పరుగులు పెట్టారు. మరి కొంతమంది విద్యార్థులు చేసేదిలేక తమ పుస్తకాల బ్యాగ్‌ను బుజాలపై పెట్టుకొని అతి కష్టంపై తమ గృహాలకు చేరుకున్నారు. అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో రోడ్లు, సైడ్ కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మడియాలయ్య దేవరకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



దేవరకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

పుల్లలచెరువు: వర్షాలు సకాలంలో కురవాలని, పంటలు బాగా పండాలని మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వారి ఇలవేల్పు మడియాలయ్య దేవరకు బోనాలు సమర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలో రజకులంతా పాల్గొని బోనాలతో మడియాలయ్య దేవరను సందర్శించుకుని వానలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి పాడిపంటలతో తులతూగాలని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి శావణమాసంలో ఈ బోనాలు సమర్పిస్తామని రజక సంఘ నాయకులు గాలెయ్య తెలిపారు. దేవరకు మొక్కుబడిగా ప్రభను ఏర్పాటు చేసి ఊరేగింపు గ్రామ పురవీధుల్లో భక్తి పాటలు పాడుకుంటూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ఊరేగుతున్న పోలేరమ్మ తల్లి విగ్రహాలు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో తొమ్మిది రోజుల పాటు గ్రామ దేవత పోలేరమ్మ తల్లి కొలుపులు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి రెండు రోజులు ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ తల్లి నూతన విగ్రహంతో పాటు బొల్లావులు, పావనం, వీర తాళ్ల విగ్రహాలను గ్రామ ప్రజలు సోమవారం ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వారు పోస్తూ కొబ్బరికాయలు కొట్టారు. గ్రామ ప్రజలు, బంధుమిత్రులు కులాలకు అతీతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరమని, తద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతీబాయ్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం మద్దులూరులోని ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పార్వతీబాయ్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మద్దులూరు సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ సుబ్బారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, ధనలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.



తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది